కొయ్యూరులో పర్మిట్ పేపర్లను తనిఖీ చేస్తున్న ఎస్సై అభినవ్

ఇసుక దోపిడీపై ఎస్పీ సీరియస్

- భూపాలపల్లి, కొయ్యూర్‌లో చెక్‌పోస్టులు
- 13 లారీల సీజ్.. కేసు నమోదు

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 23 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక దోపిడీపై ఎస్పీ సీరియస్ అయ్యారు. ఇసుక అక్రమ తరలింపు, ఓవర్ లోడ్, అతి వేగం వల్ల జరుగుతున్న ప్రమాదాలపై ఎస్పీ కిరణ్ కరె ప్రత్యేకదృష్టి సారించారు. 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో శనివారం 'ఇసుక దోపిడీ.. రోజుకు 30 లక్షలు' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్పీ జిల్లాలో ఇసుక దోపిడీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్‌తో తనిఖీలను ముమ్మరం చేశారు. భూపాలపల్లి, కొయ్యూరులో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో కాటారంలో 8, భూపాలపల్లిలో 5 మొత్తం 13 లారీలు ఓవర్‌లోడ్‌తో పట్టుబడ్డాయి. ఒక్కో లారీలో పరిమితికి మించి అదనంగా 10 టన్నులకుపైనే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. 13 లారీలను సీజ్ చేసిన పోలీసులు లారీ డ్రైవర్లు, ఓనర్లపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని కాటారం, మహదేవ్‌పూర్ మండలాల్లో ఇసుక క్వారీలు కొనసాగుతున్నాయి. కాళేశ్వరం పరిధిలో మద్దులపల్లి (పలుగుల-7), అన్నారం కామన్ క్వారీ, అన్నారం బరాజ్ అప్‌స్ట్రీమ్ క్వారీ, పుస్కుపల్లి (కొల్లూరు 2), పలుగుల-5, పలుగుల 8, పలుగుల-11, పుస్కుపల్లి (పలుగుల-6), మహదేశపూర్ పరిధిలోని పెద్దంపేట క్వారీల నుంచి మొత్తం రోజుకు సుమారు 17,100 టన్నుల ఇసుక రవాణా జరుగుతున్నది. రోజుకు సుమారు 700 లారీలు ఇక్కడి నుంచి ఇసుకను వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ నగరాలకు తరలిస్తుంటాయి. లారీలు భూపాలపల్లి, కొయ్యూరు మీదుగా తరలివెళ్తుంటాయి. దీంతో పోలీసులు కొయ్యూరు, భూపాలపల్లి లోని జెన్‌కో వద్ద ప్రత్యేకంగా ఆదివారం చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్కడే ఉన్న వేబ్రిడ్జిల వద్ద స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున ప్రారంభమైన తనిఖీలను పోలీసులు షిఫ్టుల వారీగా కొనసాగిస్తున్నారు. ఒకేరోజు మొత్తం రెండు చెక్‌పోస్టుల వద్ద 13 ఓవర్ లోడ్ లారీలను సీజ్ చేసి కేసులు పెట్టారు. నిత్యం చెక్‌పోస్టులు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

మామతో కలిసి భర్తను చంపిన మహిళ

- మృతదేహాన్ని ఇంటి పక్కన ఖాళీ స్థలంలో పూడ్చివేత
- కామారెడ్డి జిల్లా తిర్మలాపూర్‌లో అమానుష ఘటన

రాములు (ఫైల్)

బాన్సువాడ రూరల్, జూన్ 23: తన మామతో కలిసి కట్టుకున్న భర్తను హత్య చేసింది ఓ భార్య. మృతదేహాన్ని తన ఇంటి పక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో పూడ్చిపెట్టింది. ఈ అమానవీయ ఘటన ఆదివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. తిర్మలాపూర్‌కు చెందిన కుర్మ రాములు (33) జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసై భార్య మంజుల, తండ్రి నారాయణను హింసించేవాడు. దీంతో విసిగిపోయిన వారిద్దరూ ఈ నెల 9న మద్యం తాగి వచ్చిన రాములును గొడ్డలితో నరికి హత్యచేశారు. మృతదేహాన్ని ఇంట్లో ఉన్న సంపులో మూడురోజులపాటు ఉంచారు. పొరిగింటి వారు ఇతర గ్రామానికి వెళ్లగా.. సంపులోని మృతదేహాన్ని తీసి పక్కింటి వారి ఖాళీ స్థలంలో గుంతతీసి పాతిపెట్టారు. అంతే కాదు.. పది రోజులుగా రాములు కనిపించడం లేదని మృతుడి భార్య మంజుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పక్కింటి వారి స్థలంలో అనుమానాస్పదంగా తవ్విన గుంత కనిపించడంతో స్థానికులు వారిద్దరినీ నిలదీశారు. దీంతో రాములును తామే హత్య చేసినట్టు ఒప్పుకోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని నిందితుల సమక్షంలో గుంతను తవ్వగా రాములు మృతదేహాన్ని గుర్తించామని సీఐ కృష్ణ తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గ్రామస్థాయి అధికారులు, స్థానికుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి, నిందితులను అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని సీఐ వివరించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

రగులుతున్న నిరుద్యోగులు

> మొదటిపేజీ తరువాయి...

దుమ్మెత్తిపోస్తున్నారు. తమకు నమ్మకద్రోహం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పది ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వేదికగా నేడు ఉదయం నుంచి ఆమరణ నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్టు నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. దీక్షలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3తో పాటు డీఎస్సీ, గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థులు, 46 జీవో బాధితులు పెద్దసంఖ్యలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నట్టు జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్ ప్రకటించారు. దీక్షకు అన్ని విద్యార్థి, నిరుద్యోగ సంఘాల పూర్తి మద్దతు ప్రకటించాయి. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య సైతం తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

'ఉద్యోగాలు ఇస్తారా..? గద్దె దించాలా?'

'ఉద్యోగాలు ఇస్తారా..? గద్దె దించాలా?' అనే నినాదంతో ఉద్యమాలు చేస్తామని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రకటించింది. ఇచ్చిన హామీల అమలుకోసం ఇప్పటికే ఇందిరాపార్కు వద్ద వేలాది మంది నిరుద్యోగులు మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. అంతకుముందు సచివాలయం ముట్టడికి సిద్ధపడిన నిరుద్యోగులను పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేసి అడ్డుకున్నారు. ఇందుకు కొనసాగింపుగా నల్లగొండ, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెంతో పాటు పలు జిల్లాలో నిరుద్యోగుల నిరసన కార్యక్రమాలు జోరందుకున్నాయి.

అడిగితే అరెస్టులా..?

కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఆ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఓటర్ల కాళ్లావేళ్లా పడి ఓట్లేయించినందుకు తమకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుణపాఠం చెప్పిందని నిరుద్యోగులు బాధపడుతున్నారు. నెలరోజులు పుస్తకాలు పక్కనబెట్టి ఆ పార్టీ గెలుపు కోసం పాటుపడ్డామని, తమను కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు నిరుద్యోగులందరికీ న్యాయం చేస్తామన్న కాంగ్రెస్, ఇప్పుడు హామీలు అమలు చేయాలని అడిగితే పోలీసులతో అరెస్టులు చేస్తున్నదని మండిపడుతున్నారు. హామీలు నెరవేర్చే దాకా తగ్గేదే లేదని, ప్రత్యేక తెలంగాణ కోసం ఎలా పోరాడామో ఇప్పుడు తమ డిమాండ్ల సాధన కోసం అలానే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.

నిరుద్యోగుల 10 ప్రధాన డిమాండ్లు ఇవే

- గ్రూప్-2లో 2,000 వరకు పోస్టులు పెంచాలి
- గ్రూప్-3లో 3,000 వరకు పోస్టులు పెంచాలి
- గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను పిలవాలి
- డీఎస్సీలో ఉన్న 11 వేల పోస్టులను 25వేలకు పెంచాలి
- జీవో 46ను వెంటనే రద్దు చేయాలి
- గురుకుల పోస్టుల్లో రిలింక్విష్‌మెంట్ అమలు చేయాలి
- ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి
- జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించాలి
- రూ.4,000 నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- డిసెంబర్‌లో గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలి.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షం

- పర్ణశాలలో నీటమునిగిన సీతమ్మ నారచీరలు
- సింగరేణి ఓసీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఖమ్మం జిలాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. ఇంకొన్ని చోట్ల జల్లులు పడ్డాయి. ఎట్టకేలకు వాన కురిసి నేల తడవడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సీతమ్మవాగు పొంగింది. పర్ణశాలలో సీతమ్మ నారచీరల ప్రాంతం పూర్తిగా నీటమునిగింది. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి సింగరేణి ఇల్లెందు కోయగూడెం ఓసీలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. 8 వేల టన్నుల మేర బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కొత్తగూడెం ఏరియాలో కూడా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీల్లోకి కూడా భారీగా వర్షపు నీరు చేరింది. అక్కడ బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. దీంతో సింగరేణి అధికారులు బొగ్గు ఉత్పత్తి పనులను నిలిపివేశారు. సింగరేణి ప్రాంతంలో 93 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సత్తుపల్లి డివిజన్‌లో 64.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మరో రెండు రోజులు వర్షాలు

హైదరాబాద్, జూన్ 23(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొన్నది. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం, రాత్రి సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి వర్షం పడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదివారం హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షం పడింది.

సమ్మక్క బరాజ్‌కు పెరిగిన వరద

కన్నాయిగూడెం, జూన్ 23 : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతున్నది. ఆదివారం 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు పంపిస్తున్నట్టు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఎగువ నుంచి గోదావరిలోకి 2,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, అంతేమొత్తంలో దిగువకు వదులుతున్నారు. ఇదివరకే బరాజ్ 10 గేట్లు ఎత్తగా, ప్రస్తుతం వరద పెరగడంతో మరో 5 గేట్లు ఎత్తినట్టు ఏఈఈ సాయిరాం తెలిపారు.

కేజీబీవీలో విద్యార్థిని ఆత్మహత్య

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 23 : జనగామ జిల్లాలో కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకెళ్తే.. చిల్పూర్ మండలం కిమానితండాకు చెందిన ఇస్లావత్ పీరమ్మ, కిషన్ దంపతులు తన కూతురు వర్షిణి(14)ని 21న చిల్పూర్ కేజీబీవీలో 9వ తరగతిలో చేర్పించారు. మరుసటి రోజు ఉదయం పడుకొన్న వర్షిణి నోటి నుంచి నురుగలు రావడం, పక్కనే కూల్ డ్రింక్ బాటిల్‌ను అటెండర్ గమనించింది. చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

సంగమేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి

తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కృష్ణా నదిలో నీరు లేకపోవడంతో తేలిన సంగమేశ్వర ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తెలంగాణ భక్తులు మరబోట్లు, లాంచీల్లో సోమశిల వద్ద నుంచి సంగమేశ్వరాలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వారు వాహనాల్లో ఆలయానికి వస్తున్నారు.

- నాగర్‌కర్నూల్ ఫొటోగ్రాఫర్

'టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలను భర్తీ చేయాలి'

హిమాయత్‌నగర్, జూన్ 23 : ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ బాలిగ, ప్రధాన కార్యదర్శి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆయ న మాట్లాడుతూ.. టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ వృత్తి నైపుణ్యంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ఇక్కడ కూడా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి వివేక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యవతి, నాయకులు విజయ్, రాధ, హరిప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

ప్రాణహితకు స్వల్పంగా వరద

హైదరాబాద్, జూన్23 (నమస్తే తెలంగాణ): ఎగువ రాష్ట్రాలతోపాటు, రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో గోదావరి బేసిన్‌లోని పలు ప్రాజెక్టులకు స్వల్పంగా వరద వచ్చి చేరుతున్నది. ఎస్సారెస్పీకి 3,472 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 2,970 క్యూసెక్కుల వరద వస్తున్నది. ఇక ప్రాణహిత నుంచి గోదావరిలోకి 4,950 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. కృష్ణాబేసిన్‌లో జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గిపోయింది. ప్రసుతం 884 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్నది.

కొమురవెల్లి ఆలయ ఉద్యోగుల బాహాబాహీ

చేర్యాల, జూన్ 23: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఉద్యోగుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఒకరిపై మరొకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉద్యోగుల్లో సఖ్యత కోసం ఈవో బాలాజీ ఆదివారం సమావేశమయ్యారు. ఏఈవో గంగా శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అంజయ్య మధ్య మాటామాట పెరిగింది. ఏఈ అంజయ్య చెంపను ఏఈవో శ్రీనివాస్ చెల్లుమనిపించారు. అక్కడే ఉన్న ప్లంబర్ విజయ్ గొడవలో కలుగజేసుకున్నాడు. వెంటనే శ్రీనివాస్‌పైకి అంజయ్య కుర్చీ లేపారు. అక్కడే ఉన్న సహచర ఉద్యోగులు వారిద్దరినీ అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

చిత్రం

ఇప్పటికి కథ ఓ కొలిక్కొచ్చింది

సినిమా విడుదల కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎదురుచూడటం పరిపాటే. కానీ.. షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా?.. అని ఆసక్తిగా ఎదురుచూడటం మాత్రం ఒక్క రాజమౌళి సినిమాల విషయంలోనే జరిగేది. ఆయన సినిమా అధికారిక ప్రకటన నుంచే సినిమా ప్రమోషన్స్ కూడా మొదలవుతాయి. అది రాజమౌళి స్టైల్. మహేశ్, రాజమౌళి సినిమా ప్రకటన కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ఎదురుచూస్తున్నారు. రాజమౌళి, రచయిత విజయేంద్రప్రసాద్ కొన్ని ప్రైవేటు కార్యక్రమాల్లో ఈ సినిమా గురించి ఇస్తున్న చిన్న చిన్న లీకులే, పెద్ద పెద్ద వార్తలై కూర్చుంటున్నాయి. మహేశ్ తన హెయిర్ స్టయిల్ మార్చుకోవడం, స్పెషల్ ట్రైనర్‌ని పెట్టుకొని కసరత్తులు షురూ చేయడం.. వీటిని కూడా వార్తలు కిందవండేస్తున్నారు. లోకం చుట్టిన వీరుడి కథతో ఈ సినిమా తీయబోతున్నట్టు ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ఓ జాతీయ మీడియాకి ఇచ్చిన అప్‌డేట్.. ఈ సినిమా విషయంలో కాస్త క్లారిటీని ఇచ్చింది. 'నేనిప్పటివరకూ రాజమౌళి సినిమాకు సంబంధించిన సంగీత పనులు మొదలుపెట్టలేదు. ఎందుకంటే ఈ వారమే ఈ కథ లాక్ అయింది. ప్రస్తుతం టెస్ట్ షూట్స్ జరుగుతున్నాయి. జూలైలోకానీ, ఆగస్టులో కానీ మ్యూజిక్ వర్క్ స్టార్ట్ చేస్తా.' అన్నారు. అంటే.. ఇప్పటివరకూ కథే లాక్ అవ్వలేదు. ఇంకా స్క్రీన్‌ప్లే, డైలాగ్స్.. చాలా తతంగముంది. రాజమౌళి ప్రీప్రొడక్షన్ వర్క్‌కే ఎక్కువ సమయం తీసుకుంటారు. దీన్ని బట్టి ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది మొదలవ్వడం కష్టమనే చెప్పాలి.

బాలీవుడ్ అగ్ర కథానాయిక సోనాక్షి సిన్హా తన చిరకాల స్నేహితుడు జహీర్ ఇక్బాల్‌తో కలిసి వివాహబంధంలోకి అడుగుపెట్టింది. వీరిద్దరి పెళ్లి వేడుక ఆదివారం ముంబయిలోని సోనాక్షి సిన్హా స్వగృహంలో నిరాడంబరంగా జరిగింది. సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఈ వివాహ వేడుకకు ఇరువురి కుటుంబ సభ్యులతో పాటు సన్నిహిత మిత్రులు హాజరయ్యారు. వివాహానంతరం తన పెళ్లి ఫోటోలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంది సోనాక్షి సిన్హా. ఈ కొత్త దంపతులకు పలువురు బాలీవుడ్‌ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు అందజేశారు.

కాశ్మీరు లోయలో కన్యాకుమారితో..

రవితేజ, హరీశంకర్.. వీరి కాంబినేషన్‌ని మాస్ ఎక్కువగా ఇష్టపడతారు. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'మిస్టర్ బచ్చన్' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 90శాతం పూర్తయిందని మేకర్స్ తెలిపారు. అందమైన కాశ్మీర్‌వ్యాలీలో గత నాలుగురోజులుగా రవితేజ, భాగ్యశ్రీ బోర్సేలపై బ్యూటిఫుల్ మెలొడీ సాంగ్‌ని దర్శకుడు హరీశ్‌శంకర్ చిత్రీకరిస్తున్నారు. శేఖర్ మాస్టర్ ఈ పాటకు నృత్యరీతుల్ని సమకూరుస్తున్నారు. ఈ ఆదివారంతో ఈ పాట చిత్రీకరణ పూర్తయినట్టేననీ, సాహిత్యపరంగానేకాక, కనువిందైన భావోద్వేగాలతో ఈ పాటను తీర్చిదిద్దడం జరిగిందని, మిగతా షూటింగ్‌ని పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. జగబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సమర్పణ: పనోరమా స్టూడియోస్ అండ్ టీ.సిరీస్.

వరుణ్‌తేజ్ క్రైమ్ కామెడీ?

కంచె, తొలిప్రేమ, గద్దలకొండ గణేశ్, ఫిదా.. ఒకదానికొకటి సంబంధం లేని జానర్లను ఎంచుకుంటూ అభిరుచి గల నటుడిగా ఎదిగారు వరుణ్‌తేజ్. ప్రస్తుతం ఆయన కరుణకుమార్ దర్శకత్వంలో 'మట్కా' అనే సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు తరువాత సినిమాకోసం కథల్ని కూడా వింటున్నారు. ఈ క్రమంలో దర్శకుడు మేర్లపాక గాంధీ చెప్పిన కథను వరుణ్ ఓకే చేశారట. యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని సమాచారం. వేంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్‌రాజా చిత్రాలతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు మేర్లపాక గాంధీ. క్రైమ్ కామెడీ కథల్ని తెరకెక్కించడంలో ఆయన దిట్ట. వరుణ్‌కోసం రాసుకున్న కథ కూడా అదే జానర్‌లో ఉంటుందని సమాచారం. 'మట్కా' తర్వాత వరుణ్ నటించే సినిమా ఇదేనని ఇన్‌సైడ్ టాక్.

మత్స్యకారుల జీవన ప్రతిరూపం రేవు

'రేవుల దగ్గర జీవనం సాగించే మత్స్యకారుల ఇబ్బందులే ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని 'రేవు' సినిమా చేయడం నిజంగా మంచి ప్రయత్నం. కొత్తవాళ్లతో సినిమా చేశారని తెలిసినప్పుడు సినిమాపై ఆసక్తి పెరిగింది. దర్శకుడు హరినాథ్ పులి చూడటానికి చిన్నవాడైనా, సినిమా బాగా తీస్తారు. ఈ చిన్న సినిమా మౌత్ టాక్‌తో పెద్ద హిట్ సాధించాలి. నిర్మాతలు డా.మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లిలకు ఆర్థికంగా లాభాలు రావాలి. అలాగే.. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు ఈ సినిమాకు ప్రొడక్షన్ పర్యవేక్షకులుగా, మరో సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాతో వాళ్లు సక్సెస్ సాధించాలి' అని మురళీమోహన్ ఆకాంక్షించారు. వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏవూరి హరి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'రేవు'. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీమ్ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. మురళీమోహన్, రామ్‌గోపాల్‌వర్మ, అనన్య నాగళ్ల, సంపత్‌నంది, ఉత్తేజ్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. గురుతేజ్, సుమేశ్ మాధవన్, హేమంత్ ఉద్భవ్, లీలా వేంకటేశ్ కొమ్మూరి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రేవంత్ సాగర్, నేపథ్య సంగీతం: వైశాక్ మురళీధరన్.

ఆల్ ఇండియా ర్యాంకర్స్

'AIR' పేరుతో ఓ వెబ్‌సిరీస్ రూపొందనుంది. 'ఆల్ ఇండియా ర్యాంకర్స్' అనేది ఉపశీర్షిక. హర్ష రోషన్, భాను ప్రతాప్, జయతీర్థ, హర్ష చెముడు, సింధు రెడ్డి ప్రధాన పాత్రధారులు. ఈ సిరీస్ వివరాలను తెలియజేస్తూ ఈటీవీ విన్ ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేసింది. జోసెఫ్ క్లింటన్ ఈ సిరీస్‌కి దర్శకుడు. ఆదివారం పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్ లాంఛనంగా మొదలైంది. నిర్మాత ఎస్కే ఎన్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇదో థ్రిల్లింగ్ వెంచర్ అని, ప్రేక్షకులకు గుర్తుండిపోయే సిరీస్ అవుతుందని, ఎమోషన్, డ్రామా, వినోదం కలబోతగా ఈ సిరీస్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సిరీస్‌కి సందీప్‌రాజ్ సమర్పకుడు కాగా, పాకెట్ మనీ పిక్చర్స్ పతాకంపై ఈ సిరీస్ రూపొందనుంది.

మధురమైన ప్రేమజ్ఞాపకం

ఉదయ్‌రాజ్, వైష్ణవిసింగ్ జంటగా రూపొందుతోన్న చిత్రం 'మధురం'. 'ఎ మెమరబుల్ లవ్' అనేది ఉపశీర్షిక. రాజేశ్ చికిలే దర్శకుడు. ఎం.బంగార్రాజు నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం సెన్సార్ దశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. హీరో నితిన్ ఈ టీజర్‌ని విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. '1990 నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. అప్పటి స్కూళ్ల వాతావరణం, ఆటలు, అల్లర్లు, గొడవలు అన్నీ కళ్లకు కట్టేలా ఇందులో చూపించాం. అభిరుచి గల నిర్మాత దొరకడం వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చింది. అందరూ మనసుపెట్టి పనిచేసిన సినిమా ఇది' అని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.

శివన్న బైలింగ్వల్ సినిమా

సౌత్ సినిమా టాప్‌స్టార్స్‌లో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ ఒకరు. తెలుగులో కూడా ఆయనకు అభిమానులున్నారు. దీనికితోడు కన్నడ సినిమాలకు తెలుగులో మంచి గిరాకీ కూడా ఉంది. ఈ నేపథ్యంలో శివరాజ్‌కుమార్ సతీమణి గీతా శివరాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా శివరాజ్‌కుమార్ తాజా మూవీని అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా కన్నడ, తెలుగు భాషల్లో బైలింగ్వల్ ఫిల్మ్‌గా తెరకెక్కించనున్నారు. కార్తీక్ అద్వైత్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, సుధీర్.పి నిర్మాతలు. స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, ఇప్పటికే మ్యూజిక్ కంపోజిషన్ కూడా మొదలైందని, ఆగస్ట్‌లో ఘనంగా ఓపెనింగ్ ఉంటుందని, ఇందులో శివరాజ్